క్లుప్తంగా

విద్యార్థిని అభినందించిన ఐటీడీఏ పీఓ



లక్ష్మిని అభినందిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

దుమ్ముగూడెం: నిరుపేద కుటుంబానికి చెందిన కొరసా లక్ష్మి పాట్నా ఐఐటీలో సీటు సాధించడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ అన్నారు. ఐఐటీ సీటు సాధించిన మండలంలోని కాటాయిగూడెంకు చెందిన లక్ష్మితోపాటు ఆమె తల్లిదండ్రులను శుక్రవారం ఆయన భద్రాచలంలో అభినందించి మాట్లాడారు. భద్రాచలం గురుకుల పాఠశాలలో ఐదు నుండి ఇంటర్ వరకు చదివిన ఆమె ఎంపీసీలో 922 మార్కులు సాధించి ఐఐటీ సీటు దక్కించుకుందని తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మికి తరఫున ల్యాప్‌ట్యాప్ ఇవ్వడంతోపాటు చదువుకు అండగా నిలుస్తామని పీఓ చెప్పారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ప్రిన్సిపాల్ దేవదాస్, తల్లిదండ్రులు కన్నయ్య, శాంతమ్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తుమ్మల

దమ్మపేట: మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును శుక్రవారం తాటిసుబ్బన్నగూడెంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ మేరకు స్థానిక రాజకీయాలపై చర్చించారు. జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ముంపు ప్రాంతాల్లో భట్టి పర్యటన

భద్రాచలం/దుమ్ముగూడెం: గోదావరి ముంపు ప్రాంతాల్లో శనివారం సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో కలిసి ఆయన నియోజకవర్గంలోని ముంపు గ్రామాలు, కాలనీలను సందర్శిస్తారు. ఉదయం 10గంటలకు కరకట్ట పరిశీలన అనంతరం అశోక్ నగర్, కొత్త కాలనీ సందర్శించి, గోదావరి కరకట్టపై స్లూయిజ్‌లను పరిశీలించనున్నారు. ఆతర్వాత దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి గ్రామంలో పర్యటించనున్న భట్టి మంగువాయి బాడవాలో పునరావాస కేంద్రాన్ని సందర్శిస్తారు.

పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు వాయిదా

మణుగూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం భారీ వర్షాల కారణంగా సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో జరగాల్సిన పాలిసెట్-2023 స్పాట్ అడ్మిషన్లను ఆగస్టు 1 తేదీకి వాయిదా వేస్తున్నట్లు ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం ఈ నెల 31 వరకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు

దుమ్ముగూడెం : మండల పరిధిలోని గోవిందాపురంలో మంగ్వాయిబాడ్వ పునరావాసకేంద్రంలో ఆర్లగూడెం ప్రభుత్వ ఆయుర్వేదిక్, పర్ణశాల ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గోవిందాపురంలో హోమియో వైద్య శిబిరాన్ని సర్పంచ్ తెల్లం వరలక్ష్మి, ఎంపీటీసీ తెల్లం భీమరాజు ప్రారంభించారు. హోమియో వైద్యాధికారి డాక్టర్ రాజేష్ బాబు, డాక్టర్ ఉషారాణి, సిబ్బంది ఈశ్వరి, మోహబూబ్, ఆశ వర్కర్లు సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెంట్లం గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ఫ్రైడే డ్రైడేను పరిశీలించి, సిబ్బందికి తగిన సలహాలు , సూచనలు చేశారు. డీపీఎంఓ వెంకటేశ్వరరావు, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, జయలక్ష్మి, ఆశలు, పంచాయతీ సెక్రటరీ రమేష్ పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలపరిధిలోని గుర్రాలకుంటలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కేపీ జగన్నాథపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈశిబిరంలో స్థానిక వైద్యాధికారి రాజు రోగులను పరీక్షించి, మందులను పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శృతి, హెచ్‌వీ ఇంద్రావతి, ఏఎన్ఎంలు వీరభద్రమ్మ, అనురాధ, హెచ్ఏఎం ఉప్పలయ్య, ఆశ వర్కర్లు రాణి, వెంకటమ్మ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో తనిఖీలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలను శుక్రవారం ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాలల్లో భోజనం, స్టోర్ గదిలో ఉన్న నిల్వలను, మరుగు దొడ్లను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, సత్యవరపు సంపూర్ణ, మందపాటి మోహన్ రెడ్డి, లింగిశెట్టి వెంకటేశ్వరరావు ఉన్నారు.

వరద దిగ్బంధనంలోనే..

- వందల ఎకరాలలో పంట నీట మునక
- ఇళ్లలోకి చేరుతున్న నీరు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

బూర్గంపాడు: గోదావరికి వరద పోటెత్తుతోంది. ఏజెన్సీ ప్రాంతంలో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం డివిజన్‌లోని ఏజెన్సీ గ్రామాలలో వందల ఎకరాలలో పంట నీటమునిగింది. పలుచోట్ల రహదారులపైకి వరదనీరు చేరటంతో రాకపోకలు స్తంభించాయి. అధికార యంత్రాంగం వరద ముంపు గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. బూర్గంపాడు- నాగినేనిప్రోలు, నాగినేనిప్రోలు-సారపాక గ్రామాల మధ్యన గోదావరి వరద మూడుచోట్ల రహదారిపై ప్రవాహిస్తోంది. అశ్వాపురం మండలం రామచంద్రాపురం, నెల్లిపాక గ్రామాల వద్ద రెండుచోట్ల గోదావరి వరద రోడ్డుపైకి చేరటంతో ఆ మార్గంలోను రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం డివిజన్‌లో సుమారు వేయి ఎకరాలలో పత్తి, 200 ఎకరాలలో వరి, 150 ఎకరాలలో జీలుగు, 7 ఎకరాలలో పిల్లిపెసర, 30 ఎకరాలలో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. అధికారులు వరద ముంపు ప్రాంతాలలో పర్యటిస్తు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

దుమ్ముగూడెం : గోదావరికి భారీగా వరద నీరు చేరుతుండటంతో తూరుబాక, బుర్రవేములా, పర్ణశాల గ్రామంలోని, సున్నంబట్టి-బైరాగులపాడు రహదారుల పైకి వరద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి పైకి వరద నీరు చేరడంతో సీఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో ఎస్సైలు కేశవ్, నర్సిరెడ్డిలు రోడ్డుకు అడ్డంగా భారీకేడ్లు, సిబ్బందిని ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. భద్రాచలం-చర్ల వెళ్లాల్సిన వారు ములకపాడు నుంచి వయా మారాయిగూడెం , చెరుపల్లి, ఏటపాక మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. గోదావరి వరదతో పర్ణశాల నారచీరల ప్రాంతం పూర్తిగా నీటమునిగింది.

కరకగూడెం: వరద బాధితుల కోసం కరకగూడెం జెడ్పీ పాఠశాలలో పునరావస కేంద్రం ఏర్పాటు చేయగా అధికారులు వారికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. చాలా చోట్ల పెదవాగు ప్రవాహంతో పొలాల్లో ఇసుక మేటలు వేశాయి, మరికొన్ని చోట్ల నాట్లు వేసిన వరిమళ్లు, పత్తి పొలాలు, చెరువులను తలపిస్తున్నాయి. మోతె, నర్సంపేట ఎస్సీ కాలనీ, తాటిగూడెం గ్రామాల్లోని పలు ఇళ్లలో పారిన వరద వల్ల మురుగు పేరుకుపోయింది.

చర్ల: గోదావరి ఉగ్ర రూపం దాల్చడంతో 12వ నెంబర్ రాష్ట్రీయ భద్రాచలం వెంకటాపురం రహదారి మార్గంలో కుదునూరు - దేవరాపల్లి, సుబ్బంపేట-ఎదిరగుట్టల మధ్యలో ప్రధాన రహదారులు నీటమునిగాయి. దండుపేట - కొత్తపల్లి, లింగాపురంపాడు-లింగాపురం గ్రామాలలో మధ్యలోని రహదార్లపైకి సైతం పది అడుగుల మేర వరదనీరు చేరింది. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని పలు గ్రామాల్లోని ఇళ్లను వరదనీరు చుట్టుముట్టింది.



బూర్గంపాడు: నీట మునిగిన పత్తి చేను



దుమ్ముగూడెం : పర్ణశాల గ్రామంలోకి వెళ్లే దారిలో భారీగా చేరిన వరద నీరు



భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



చర్ల: కుదునూరు-దేవరాపల్లి ప్రధాన రహదారిని ముంచెత్తిన వరద



దుమ్ముగూడెం : పూర్తిగా మునిగిపోయిన పర్ణశాలలోని నారచీరల ప్రాంతం



కరకగూడెం: బర్లగూడెంలో కోతకు గురైన రోడ్డు



అశ్వారావుపేటరూరల్: చెన్నయ్య కట్ట చెరువు వద్ద కోతకు గురైన రోడ్డు

● మూటాముల్లెతో పునరావాస కేంద్రాలకు..

బూర్గంపాడు: గోదావరి వరద తీవ్రత పెరుగుతుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు మూటా ముల్లె సర్దుకుని పునరావాస కేంద్రాల బాట పట్టారు. బూర్గంపాడు కస్తూర్బా పాఠశాల, వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు సుమారు 220 కుటుంబాలు చేరుకున్నాయి. నాగినేనిప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు 30 కుటుంబాలు తరలివచ్చాయి. సారపాకలోని ఐటీసీ అనుబంధ బీపీఎల్ స్కూల్‌కు 150 కుటుంబాలు వచ్చాయి. వీరికి ప్రభుత్వ యంత్రాంగంతో పాటుగా ఐటీసీ సహకారంతో భోజన వసతులు కల్పించారు. వైద్యబృందాలను అందుబాటులో ఉంచారు.బాధితులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టారు.

చర్ల: మొత్తంగా చర్ల మండలంలోని 12 గ్రామాలకు చెందిన 653 కుటుంబాల వారు 11 పునరావాస కేంద్రాలలో తలదాచుకుంటున్నారు.



పునరావాస కేంద్రంలో వరద బాధితుల సామగ్రి



సామాన్లు మోసుకుంటూ పునరావాస కేంద్రానికి..



చింతల బయ్యారం గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్న అధికారులు

● సహాయక చర్యలు..

పినపాక: మండలంలోని పంచాయతీల్లో ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారు. మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, సీఐ రాజగోపాల్, ఎస్సై నాగుల్ మీరా అర్ధరాత్రి దాటేదాకా సింగిరెడ్డి గ్రామంలోనే ఉండి వరద ఉధృతిని పరిశీలించారు. గోదావరి ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో చింతల బయ్యారంలోని గ్రామస్తులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. పంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేపట్టి, బ్లీచింగ్ చల్లుతున్నారు.

వరద బాధితులకు ప్రభుత్వం అండగా..



చింతిర్యాలలో స్థానికులను అప్రమత్తం చేస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరు రూరల్: వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం ఆయన మిట్టగూడెం గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. వరద ముంపు బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వరద బాధితులెవ్వరు అధైర్య పడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున ముంపు గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు.

'మిషన్ భగీరథ' దేశానికే ఆదర్శం

అశ్వాపురం : తెలంగాణలో అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. మండలంలోని మిట్టగూడెం గ్రామంలో గల మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వాటర్ ఫిల్టర్ బెడ్, మిషన్ భగీరథ పంప్‌హౌజ్, కుమ్మరిగూడెంలోని ఇంటెక్‌వెల్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతమైన చింతార్యాలలో పర్యటించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు.

వితరణ..

కరకగూడెం: మండలంలోని తాటిగూడెం గ్రామానికి చెందిన పలువురు వరద బాధితులకు శుక్రవారం వారి గ్రామంలో ఆదర్శసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యవసరాలలు, ఆర్థిక సాయం ట్రస్ట్ చైర్మన్ జాడి రామనాథం అందజేశారు. ఉపసర్పంచ్ జాడి నాగరాజు, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండాల: మండలంలోని ముత్తాపురం గ్రామంలో అధిక వర్షాలతో ముంపునకు గురైన 45 కుటుంబాలకు మండల కేంద్రానికి చెందిన మానాల భద్రయ్య-శాంతమ్మల జ్ఞాపకార్థంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. బాధితులను పరామర్శించిన వ్యాపారులు మానాల నారాయణ మూర్తి, వెంకటేశ్వర్లు, వీరన్న, ప్రభాకర్‌లు రూ. లక్ష విలుచేసే సామాన్లను అందించారు. బియ్యంతో పాటు, నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు అందించారు. ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ రామక్క, సర్పంచ్ సీతారాములు, పూనెం సమ్మయ్య, తహసీల్దార్ నాగదివ్య, ఎంపీఓ వలీ, ఎస్సై రాజశేఖర్, ఎన్డీ నాయకులు మధు, మానాల సతీష్, ప్రణీత్, ఇల్లందు అప్పారావు, నాగరాజు పాల్గొన్నారు.

భోజనం ఏర్పాటు..

మణుగూరు రూరల్: గోదావరినది వరద ముంపునకు గురైన ప్రజలకు ములుగు ఎమ్మెల్యే సీతక్క తనయుడు కాంగ్రెస్ రాష్ట్ర యూత్ కార్యదర్శి ధనసరి సూర్య అండగా భోజనం సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరీఫ్ పాషా, వరలక్ష్మీ, సాంబశివరావు, వీరభద్రం, రాణి, జెనరేష్, కళ్యాణ్, ఈశ్వర్, నందు, సాగర్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

భద్రాచలంటౌన్: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని జీఎస్పీ అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఐటీడీఏ ప్రాంగాణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలతో ఏజన్సీ ప్రాంతంలోని రైతులు తీవ్రగా నష్టపోయాలని వారిని ఆదుకొని మెరుగైన పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పర్శిక సోమరాజు, పూనెం కృష్ణదొర, పుల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుండాల: వర్షాలకు నష్టపోయిన రైతులను, బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దెబ్బతిన్న పంటల సర్వే నిర్వహించి నష్టం అంచనా వేయాలన్నారు. ఈ మేరకు మండలంలో పర్యటించిన ఐటీడీఏ పీఓకు వినతి పత్రం అందించారు. జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీపీ ముక్తి సత్యం, సర్పంచ్ కోరం సీతారాములు ,యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, పెండెకట్ల పెంటన్న, పర్శిక రవి, బాబు, ఈసం క్రిష్ణ, మల్లన్న, జార్జి, ఆజద్ పాల్గొన్నారు.

కరకగూడెం: భారీ వర్షాల మూలంగా సర్వం కోల్పోయిన వరద బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల వ్యాప్తంగాపర్యటించి వరదల వల్ల నష్టపోయిన రైతుల పొలాలను, కూలిన ఇళ్లను, తెగిన చెరువు అలుగులను, కోతకు గురైన రహదారులను పరిశీలించారు.

ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

చర్ల: మండలంలోని గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పొదెం వీరయ్య శుక్రవారం పర్యటించారు. మండలంలోని కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి, దండుపేట గ్రామాలలో పర్యటించిన ఆయన బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యేకు తమ బాధలు వెళ్లబుచ్చారు. వర్షాకాలం వస్తే భయంతో బతుకుతున్నామన్నారు. ఆయన మాట్లాడుతూ అధైర్యపడొద్దని అధికారుల సూచనల మేరకు నడుచుకొని ప్రమాదాల నుంచి బయటపడాలని సూచించారు. బాధితులకు మంచి భోజనం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. అనారోగ్య సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఈ సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భరణిబాబు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, సెక్టోరియల్ ఆఫసర్ సుధాకర్, వరదల ప్రత్యేకాధికారి అభిమన్యుడు, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాదరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు చీమకుర్తి వీరహద్రం, కె విజయకమార్ నాయుడు, సాల్మన్‌రాజు, సతీష్, పుల్లారావు, రాజారావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దండుపేటలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీరయ్య, నాయకులు

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న వెంకటరెడ్డి, తదితరులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిస్టిక్ పాస్ట్ గవర్నర్ గోలి అమరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని మార్కెట్ యార్డులో లయన్స్ క్లబ్ సభ్యులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షుడు భీమవరపు వెంకటరెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ ఉమాశంకర్ నాయుడు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఆఫ్ భద్రాచలం కార్యదర్శి గుండు శరత్, కోశాధికారి భరత్ కుమార్, పాస్ట్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ, జక్కం ప్రసాద్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, సబ్ రిజిస్టర్ గజ్జల శ్రీధర్, కాంట్రాక్టర్ విష్ణు, రమేష్, బోనాల సూర్య నారాయణ, బిల్లిపెల్లి రంగారెడ్డి, గాదే మాధవరెడ్డి, గోళ్ల భూపతి రావు, దాట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ములకలపల్లి: కుమ్మరిపాడు శివారు వాగులో గల్లంతై మృతి చెందిన కుంజా సీత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు శుక్రవారం పరామర్శించారు. ఈ మేరకు మృతురాలి కూతురు జ్యోతితో మాట్లాడి, ఘటన వివరాలు అడిగి తెలుకున్నారు. రూ 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ సవలం సుజాత ఉన్నారు. అదేవిధంగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు జారే ఆదినారాయణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతిని వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితిసభ్యులు నరాటి ప్రసాద్ సీత మృతదేహానికి నివాళులర్పించారు. ఎంపీటీసీ కొర్రి భద్రం, పాయం బాబూరావు ఉన్నారు.

'పోడు' పట్టాలు ఇప్పించాలని వినతి

దమ్మపేట: పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గిరిజన పోడు రైతులు విన్నవించుకున్నారు. శుక్రవారం గుండుగులపల్లి, మొండివర్రె గ్రామాలకు చెందిన గిరిజన పోడు రైతులు, తుమ్మలను గండుగులపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... 15 ఏళ్ల నుంచి పోడు భూములను సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని, అయినప్పటికీ ఇటీవలే ప్రభుత్వం పంపిణీ చేసిన పోడు పట్టాలు తమకు రాలేదని వాపోయారు. స్పందించిన తుమ్మల ఐటీడీఏ పీఓతో ఫోన్‌లో మాట్లాడి, పట్టాలు ఇప్పించాలని సూచించారు.

నోట్ పుస్తకాల వితరణ

ములకలపల్లి: మండలకేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ ఆవాస విద్యాలయం విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ, కిన్నెర ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాయల కేథారేశ్వరరావు మాట్లాడగా ప్రధానోపాధ్యాయుడు జగన్, క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, ట్రెజరర్ ఎం డీ.రంజాన్, సభ్యులు రంజిత్, డాక్టర్ సుధాకర్, సాంబశివరాలు, ఎన్‌వీ.నాయుడు, దారా నర్సింహారావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి



ప్రజలకు సూచనలు ఇస్తున్న అధికారులు

మణుగూరు రూరల్: ఎగువ ప్రాంతాలను నుంచి వస్తున్న వరదకు గోదావరి ఉధృతి పెరుగుతోందని, నది పరివాహక, ముంపు ప్రాంతాల ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని మండలస్థాయి అధికారులు సూచించారు. శుక్రవారం రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు వరద ముంపు గ్రామాలైన చిన రాయిగూడెం, కమలాపురం, కట్టుమల్లారం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను ఖాళీ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, సీఐ ముత్యం రమేష్, మున్సిపల్ కమిషనర్ ఉమా మహేశ్వరరావు, ఎస్సై రాజేష్‌కుమార్, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, రెవెన్యూ, పోలీస్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

బూర్గంపాడు: గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పర్యటించారు. బాధిత కుటుంబాలను పలకరించి వివరాలను తెలుసుకున్నారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం సోంపల్లి గ్రామానికి చెందిన తలసేమియా బాధితురాలు నడిపింటి ధరణిని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మందా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పునరావాస కేంద్రాల్లో బాధితులకు భరోసా..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ముంపు కాలనీల పర్యటనతో పాటు పునరావాస కేంద్రాలను సీపీఎం భద్రాచలం నియోజకవర్గ కో కన్వీనర్ కారం పుల్లయ్య శుక్రవారం సందర్శించి ప్రజల బాగోగులను తెలుసుకున్నారు. చర్ల రోడ్డులో గల గిరిజన అభ్యుదయ భవన్లో అయ్యప్ప కాలనీకి చెందిన ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించి వారితో మాట్లాడారు. పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై వెంకట రామారావు, పి సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, బి.కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మండలంలో మంగవాయి బాడువా హాస్టల్, గంగోలు రైతు వేదిక లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సీపీఎం నాయకులు పరిశీలించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, సొసైటీ డైరెక్టర్ యలమంచి శ్రీనుబాబు, నాయకులు మర్మం చంద్రయ్య, ఎంపీటీసీ కోర్స చిలకమ్మ, సర్పంచులు రాజేష్, కనక దుర్గ, మిడియం జయ, రాజు, కొమరం చంటి, చిట్టిబాబు, సతీష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి పంచాయతీ కొత్తూరు గ్రామం వద్ద ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైందని శుక్రవారం వరి నాట్లు వేసి నాయకులు, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్డు పునర్నిర్మించాలని, గుంతలు పూడ్చి వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నార్లపాటి శ్రీను, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అనపర్తి శ్రీనివాస్, మదార్ హుస్సేన్ పాల్గొన్నారు.



వరి నాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న స్థానికులు

నేడు మొహర్రం..



కరకగూడెం: మొహర్రంను నేడు(శనివారం) ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ముస్లింల మొహర్రం మాసం ఆరంభం రోజున 'ఇస్లాం' నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. మహ్మద్ ప్రక్త మనవళ్లు హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఇమామ్ హుస్సేన్ ఇస్లాం పరిరక్షణకు కర్బా మైదానంలో పవిత్ర యుద్ధం సాగించిన మాసం ఇది. హక్కుల కోసం ఇమామ్ హుస్సేన్ సాగించిన పోరాటంలో అమరుల త్యాగానికి ప్రతీకగా 'మొహర్రం' ను జరుపుకుంటారు. ధర్మరక్షణకు ప్రాణాలర్పించిన వారి బలిదానాన్ని స్మరిస్తూ మొహర్రం నెల ప్రారంభం నుంచి పది రోజులు స్మృతి దినాలుగా పాటిస్తారు. పదో రోజున హజరత్ 'యౌమే-ఆషురా' పాటిస్తూ విశేషంగా ప్రార్థనలు చేస్తారు. పది, పదకొండు రెండు రోజుల పాటు ఉపవాస దీక్షలను చేపడుతారు. ఈ సందర్భంగా మసీద్‌ల మకాన్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి పేదలకు అన్నదానాలు చేస్తారు. మకాన్‌ల వద్ద పీర్లను ప్రతిష్ఠిస్తారు. అలాగే పీర్ల చావిడి వద్ద చేపట్టి ప్రత్యేక కార్యక్రమాలలో ముస్లింలతో పాటు హిందువులు పాల్గొని మత సామరస్యాన్ని ప్రదర్శిస్తారు.